క్లుప్తంగా

జెడ్పీలో చలివేంద్రం ప్రారంభం



జనగామ: జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని సోమవారం జెడ్పీ సీఈఓ మాధురీ షా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఆఫీసుకు వచ్చే ప్రజలు, తదితర వ్యక్తుల దాహం తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సీఈఓ చెప్పా రు. ఈ కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ సరిత తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కసరత్తు

● ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్



మాట్లాడుతున్న అలీఖాన్

దేవరుప్పుల: రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం క్షేత్రస్థాయిలో కరసరత్తులు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ, సియాసత్ ఉర్దూ పత్రిక ఎడిటర్ అమీర్ అలీఖాన్ అన్నారు. సోమవారం పాలకుర్తిలో తలపెట్టిన కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశానికి వెళ్లే క్రమంలో మాజీ మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ డైరెక్టర్ పెద్ది కృష్ణమూర్తి కలువగా ఇక్కడి రాజకీయ పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సముద్రంలాంటి కాంగ్రెస్ పార్టీలో చిన్నచిన్న తప్పిదాలను గోరింతలు చేసే ప్రతిపక్షాల గోలను తెలంగాణ ప్రజలు నమ్మరన్నారు. పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జమాల్ షరీఫ్, మండల నాయకులు షబ్బీర్ అలీ తదితరులు ఉన్నారు.

తెలంగాణలో యక్షగానానికి ప్రత్యేక స్థానం

● ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: తెలంగాణాలోని ప్రాచీన కళారూపాల్లో యక్షగానానికి ప్రత్యేక స్థానం ఉందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బషారత్ గార్డెన్‌లో తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీవెంకటేశ్వర చిందు యక్షగాన సంఘం 2వ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ సందర్భగంగా యక్షగానం, సాంస్కృతిక ప్రదనర్శనలు ప్రత్యేక అకర్షణలుగా నిలిచాయి.

బెల్లం టీ ఆరోగ్యానికి మంచిది

పాలకుర్తి: బెల్లం టీ తాగితే ఆరోగ్యానికి మంచిదని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం పాలకుర్తిలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దారిలో టీ షాప్ వద్ద ఆగి చాయ్ తాగుతూ నాయకులతో పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేతో సెల్ఫీ ఫోటో తీసుకున్నారు. నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు రామారెడ్డి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా

జనగామ: ఆదర్శప్రాయుడు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఫిజిక్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్, గురువు కె.రామారెడ్డి అని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం రామారెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన పార్థివ దేహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సంతాపం తెలిపారు. అనురాగ్ యూనివర్సిటీ అభివృద్ధికి ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. తాను ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చదువుకునే సమయంలో రామారెడ్డి ఓ ఆదర్శవంతమైన గురువుగా కీర్తించబడ్డారన్నారు. రామారెడ్డి విద్యారంగానికి చేసిన సేవలు తరతరాలకూ మార్గదర్శ కంగా నిలుస్తాయన్నారు. విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకురావడంలో ఆయన కీలక పాత్ర వహించారన్నారు. ఆయన లేనిలోటు జీర్ణించుకోలేక పోతున్నామన్నారు.

ఘన్‌పూర్‌లో ఆగని ఎక్స్‌ప్రెస్ బస్సులు

● ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు
● బస్టాండ్ వద్ద రోడ్డు దాటలేని పరిస్థితి



స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్‌కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్‌లో ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సులు ఆగకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధానంగా జాతీయ రహదారి విస్తరణలో భాగంగా నిర్మించిన డివైడర్లతో స్థానిక బస్టాండ్ వద్ద హైదరాబాద్ నుంచి హనుమకొండ వెళ్లే వాహనాలు బస్టాండ్‌లోకి వెళ్లే అవకాశం లేకుండా పోయింది. దాంతో హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపుకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులేవీ ఘన్‌పూర్ బస్టాండ్‌లోకి వచ్చే పరిస్థితి లేకుండా అయింది. దాంతో ప్రయాణికులకు ఎక్స్‌ప్రెస్ బస్సుల తిప్పలు తప్పడం లేదు. స్థానిక బస్టాండ్ వద్ద వెహికిల్ అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించడమో, లేదా హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపు వెళ్లే ఏ బస్సులైనా స్థానిక బస్టాండ్ లోకి వచ్చేలా చర్యలు తీసుకోవడం లాంటి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రమాదకరం.. రోడ్డు దాటడం

స్థానిక బస్టాండ్ వద్ద డివైడర్ ఏర్పాటు చేయడంతో ప్రజలకు రోడ్డు దాటేందుకు కష్టాలు తప్పడం లేదు. హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం రోడ్డు దాటేందుకు ప్రతీ రోజూ ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ క్రమంలో అనునిత్యం ఇక్కడ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి పారా తైక్వాండో పోటీల్లో బంగారు పతకం



కోచ్‌తో బంగారు పతకం సాధించిన కృష్ణవేణి

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ పారా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పారా తైక్వాండో పోటీల్లో మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన మాచర్ల కృష్ణవేణి ఉత్తమ ప్రతిభతో బంగారు పతకం సాధించింది. పీ–52 సీనియర్ కేటగిరీలో కృష్ణవేణి గోల్డ్‌మెడల్ సాధించడంతో పాటు వరంగల్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఈనెల 17, 18వ తేదీల్లో పంజాబ్‌లో జరగనున్న 4వ జాతీయస్థాయి పారా తైక్వాండో పోటీల్లో తెలంగాణ జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించనుంది. ఈ మేరకు కృష్ణవేణిని కోచ్ ఎల్లావుల గౌతమ్ యాదవ్, తెలంగాణ పారా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ దిలీప్ తదితరులు అభినందించారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

● ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్ర ప్రభుత్వం కగార్ ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలని, మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వానికి పట్టువిడుపులు ఉండాలని, కేవలం ఎన్‌కౌంటర్ల ద్వారా సమస్యలు పరిష్కారం కావన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు చేసిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ..

నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన 111 మంది లబ్ధిదారులకు రూ.38.22లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కడియం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు సీఎంఆర్‌ఎఫ్ ఒక వరంలాంటిందని, రాజకీయ పార్టీలకు అతీతంగా ఎలాంటి అవినీతికి అస్కారం లేకుండా అత్యంత పారదర్శకంగా సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందిస్తున్నామన్నారు. ఏఎంసీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య, చిల్పూరు దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ రాంబాబు, పీఏసీఎస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

జఫర్‌గఢ్: ఓబులాపూర్ గ్రామానికి చెందిన లింగంపల్లి కౌసల్య అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శ్రీహరి పార్టీ బృందంతో కలిసి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మృతదేహానికి నివాళులర్పించారు. సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య, పార్టీ సీనియర్ నాయకులు అన్నెబోయిన భిక్షపతి, మాజీ సర్పంచ్ కుల్లా మోహన్‌రావు ఉన్నారు.

వైభవంగా సీతాజన్మోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

జనగామ: సీతానవమి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్, మాతృశక్తి విభాగం ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా వేడుకలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ సీతాదేవి విగ్రహానికి విశేష ఆరాధనలు నిర్వహించారు. సీతారామ నామస్మరణలు, భజనలతో ఆలయం మారుమోగింది. అనంతరం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ మోహనకృష్ణ భార్గవ మాట్లాడుతూ సీతాదేవి జన్మవృతాత్తంతం, ధర్మ సంస్థాపన, సమాజానికి బోధించిన ధర్మాలను నేటి తరం మహిళలు, యువతులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నిరంతరం ఆధ్యాత్మిక, ధార్మిక చింతనలో గడుపుతూ చైతన్యవంతమైన నవతరం నిర్మాణంలో సాధికారత వైపు అడుగులు వేయాలన్నారు. పిల్లలకు సనాతన ధర్మంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఝెలసాని నాగమణి, గజ్జెల అలివేలు, జక్క జ్యోతి, కందాడి వరలక్ష్మి, పాశం విమలారాణి, మేకల శ్రీవాణి, కవిత, పక్కీరు దీప్తి, సుజాత, రత్నమ్మ, రజిత, శైలజ, సుజాత, సత్యలక్ష్మి, స్వరూప, ధనలక్ష్మి, భార్గవి, రాములమ్మ, ఉమారాణి, సత్తమ్మ, విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఉల్లెంగుల రాజు, చిలువేరు హర్షవర్ధన్, ఝెలసాని కృష్ణమూర్తి, రాంబాబు, కందాడి యాదగిరి, చక్రాల పోచన్న, సిద్దిమల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పథకాల్లో అర్హులకు అన్యాయం చేస్తే సహించం'



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కొడకండ్ల: ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అర్హులకు అన్యాయం చేస్తే సహించబోమని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సిందె రామోజీ, మాజీ మార్కెట్ చైర్మన్ రాము, జీసీసీ మాజీ చైర్మన్ అభిమన్‌గాంధీలు అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గ్రామసభల్లోనే అర్హులైన వారిని ఎంపిక చేయాలని, ఇందిరమ్మ కమిటీల పేరుతో కాంగ్రెస్ కార్యకర్తలకే ఇళ్లు కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని, ఇళ్ల కోసం కాంగ్రెస్ కార్యకర్తలే కొట్టుకొనే దుస్థితి నెలకొంటుందని వారు ఆరోపించారు. మండలంలో 2023లో దయాకర్‌రావు హయాంలో మంజూరైన పనులను ఇప్పుడు చేపడుతున్నారే తప్ప కొత్తగా ఎలాంటి పనులు చేపట్టడం లేదని, ఆయా పనులపై కూడా సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఏమాత్రం ఉండటం లేదని, నాసిరకంగా పనులు చేస్తున్నారని దినిపై విజిలెన్స్, క్వాలిటి కంట్రోల్‌తో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. వెంకటేశ్వర్‌రావు, ప్రేమ్‌కుమార్, సోమరాములు,వెంకటనారాయణ పాల్గొన్నారు.

కంఠమహేశ్వరస్వామికి జలాభిషేకం



జలబిందెలతో గౌడ కులస్తులు

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని రఘునాథపల్లిలో కొనసాగుతున్న గ్రామ దేవతల ఉత్సవాల్లో భాగంగా గౌడ కులస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో కంఠమహేశ్వరస్వామికి జలాభిషేకం చేశారు. ఇంటింటి నుంచి నీళ్ల బిందెలతో ఉమ్మడిగా డప్పుచప్పుళ్లతో కంఠమహేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని జలాభిషేకం చేసి పాడి పంటలతో చల్లంగా ఉండాలని మొక్కుకున్నారు. కార్యక్రమంలో గౌడ పెద్దలు దుబ్బాక నాగేష్, వై కుమార్‌గౌడ్, మల్కపురం లక్ష్మయ్యగౌడ్, కోళ్ల రవిగౌడ్, కోళ్ల శ్రీను, దుబ్బాక హరీష్, మల్కపురం శ్రీకాంత్, దుబ్బాక అన్వేష్, రంగు రాజు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మొదటిరోజు 94 'భూభారతి' దరఖాస్తులు

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా జనగామ జిల్లాలో మొదట పైలట్ ప్రాజెక్టుగా స్టేషన్ ఘన్‌పూర్ మండలంలో చేపడుతున్న భూభారతి రెవెన్యూ సదస్సులలో భాగంగా మొదటిరోజున మొత్తం 94 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. మొదటిరోజైన సోమవారం మండలంలోని కొత్తపల్లి, విశ్వనాథపురం గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు సదస్సులను నిర్వహించారు. కొత్తపల్లిలో 33, విశ్వనాథపురంలో 61 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తులతో అధిక శాతం సాదాబైనామాకు సంబంధించిన దరఖాస్తులే వచ్చాయని, అదేవిధంగా ధరణిలో దోషాలపై, పేర్లు తప్పులు, ప్రభుత్వస్థలాలు, పెండింగ్‌లో ఉన్న మ్యూటేషన్ తదితర సమస్యలపై వచ్చాయని తెలిపారు. కాగా దరఖాస్తుల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి



టెన్త్ టాపర్లతో జాకీర్

దేవరుప్పుల: విద్యాశాఖ పక్షాన తలపెట్టిన సమ్మర్ క్యాంపును పాఠశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని స్కూల్ కాంప్లెక్సు హెచ్‌ఎం జె.రాజేంద్రకుమార్ సూచించారు. సోమవారం మండలంలోని కామారెడ్డిగూడెం హైస్కూల్‌లో ఇటీవల పదో తరగతి పరీక్షల్లో మండల తృతీయ స్థానం పొందిన మూడ ఐశ్వర్యతోపాటు అత్యుత్తమ మార్కులు పొందిన పులిపంపుల మధుప్రియ, బట్ట సంపత్, రాజేష్, తరుణ్, కార్తీక్, వైష్ణవీ, శ్రీచరణ్‌లను ఘనంగా సన్మానించారు. మాజీ ఎంపీటీసీ జాకీర్ హుస్సేన్, అమ్మ పాఠశాల చైర్‌పర్సన్ మమత, సీనియర్ ఉపాధ్యాయులు ఎం .లక్ష్మణ్‌జీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలి

బచ్చన్నపేట: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గ్రామసభలు నిర్వహించి ఎంపిక చేయాలని సీపీఎం మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రావుల రవీందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లను పార్టీల కతీతంగా ఇవ్వాలని, కమిటీ సభ్యులకు నచ్చిన వారికే ఇవ్వకూడదని అన్నారు. ఇంజ ఎల్లయ్య, రామగళ్ల అశోక్, కంత్రి అయిలయ్య, మనోహర్, రవి, కొమ్ము శిరీష పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బచ్చన్నపేట: అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ తెలిపారు. సోమవారం

సంక్షిప్త సమాచారం

స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన దాచేపల్లి మల్లేశం సదాశివపేట వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ పట్టుకున్నామని అన్నారు. ట్రాక్టర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇళ్లు కేటాయించాలని వినతి

బచ్చన్నపేట: తమ్మడపల్లి గ్రామంలో దళితులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి నూకల సౌజన్యకు వినతి పత్రాన్ని అందించారు. సోమవారం గ్రామంలోని జీపీ కార్యాలయం వద్ద వినతి పత్రాన్ని అందజేసిన అనంతరం వారు మాట్లాడుతూ గ్రామానికి 11 ఇళ్లు మంజూరుకాగా దళితులకు రెండు మాత్రమే ఇచ్చి వివక్ష చూపకుండా మరిన్ని కేటాయించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని నమిలిగొండ శివారులోని ప్రభుత్వ మోడల్ స్కూల్ జూనియర్‌కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో ఒక్కొక్క గ్రూపులో 40 సీట్లు చొప్పున అందుబాటులో ఉన్నాయన్నారు. బాలికలకు ఉచిత హాస్టల్ సౌకర్యం ఉందని, ఆసక్తి ఉన్న వారు ఈనెల 20లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి ఆయన సూచించారు.

రుణాలు వెంటనే చెల్లించాలి

జఫర్‌గఢ్: పెండింగ్‌లో ఉన్న బ్యాంకు లింకేజీకి సంబంధించిన మహిళా సంఘాల రుణాలను వెంటనే చెల్లించాలని బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ శరత్‌చంద్ర కోరారు. వడ్డెగూడెంలో మహిళా సంఘాల పెండింగ్ రుణాలపై ప్రత్యేక సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ ద్వారా మహిళా పొదుపు సంఘాలు రుణాలను తీసుకుని ఐదేళ్లుగా చెల్లించకపోవడంతో రూ.42 లక్షలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. వీటిని ఆయా సంఘాల సభ్యులు 10 రోజుల్లోగా బ్యాంక్‌కు తిరిగి చెల్లించాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏపీఎం రవీందర్, టీవోటీ ఫీల్డ్ అఫిసర్ శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ

పాలకుర్తి: నియోజకవర్గ కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి గుమ్మడిరాజుల సాంబయ్య పార్టీ జెండాను సోమవారం ఆవిష్కరించారు. కారల్‌మార్క్స్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు రజిత, జీడి సోమయ్య, శ్రీనివాస్, కళింగరాజు, సారయ్య, మహిళలు పాల్గొన్నారు.

దేవునిగుట్ట క్వారీ అనుమతులు రద్దు చేయాలి



దేవరుప్పుల: గిరిజనుల జీవన మనుగడకు తీవ్ర విఘాతం కలిగించే దేవునిగుట్ట క్వారీ అనుమతులు సత్వరమే రద్దు చేయాలని లకావత్‌తండా(డీ) వాసులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. బాపూజీ, సోమ్లా, నర్సింహ్మా, యాకు, విజయ్, మోహన్, రాజేశ్వరీ, లలిత, ఈసీ, బీచ్చమ్మ, నీల, రజిత, సునిత, విమల తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం దీక్షల విరమణ



దీక్షలను విరమింపజేస్తున్న ఆర్డీఓ గోపిరామ్

జనగామ రూరల్: హైదరాబాద్ రోడ్డు నుంచి పసరమడ్ల స్టేజీ వరకు నిర్మిస్తున్న బైపాస్ రోడ్డుపై ఇందిరమ్మ ఇళ్ల వద్ద అండర్‌పాస్ నిర్మించాలని సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు సోమవారం 101 రోజుకు చేరింది. కాగా సోమవారం ఆర్డీఓ గోపిరామ్ నేషనల్ హైవే డీఈ రాజారామ్, సీఐ దామోదర్‌లు నాయకులు, ప్రజలతో మాట్లాడి అండర్‌పాస్ నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో దీక్షలను విమర్మించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, అహల్య, బొట్ల శేఖర్, బూడిద గోపి, జోగు ప్రకాష్, అజారుద్దీన్, వెంకట మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వలసదారులను తిరిగి పంపించండి

● బీజేపీ నాయకులు



పాలకుర్తి: వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నర్మెట/తరిగొప్పుల/పాలకుర్తి/కొడకండ్ల/రఘునాథపల్లి: తెలంగాణాలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్‌కు చెందిన వ్యక్తులను, రోహింగ్యాలను తక్షణం తిరిగి పంపించాలని బీజేపీ నాయకులు అన్నారు. ఈ మేరకు పలు మండలాల తహసీల్దార్లకు పార్టీ శ్రేణులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమంగా దేశంలోనికి చొరబడి ధృవ పత్రాలు పొంది అనేక సంక్షేమ పథకాలు పొందుతూ దేశంలో అరాచకాలు సృష్టిస్తూ దేశ భద్రతకు ప్రశ్నార్థకంగా మారారని అన్నారు. పాలకులు, అధికారులు తక్షణ చర్యలు చేపట్టి వారిని గుర్తించి తిరిగి పంపించాలని డిమాండ్ చేశారు., నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నర్మెటలో..



రఘునాథపల్లిలో..

కడియం చేసిన అభివృద్ధి ఏమిటో నిరూపించాలి

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

జఫర్‌గఢ్: మండలానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేసిన అభివృద్ధి ఏమిటో జఫర్‌గఢ్ గుట్టపై ఉన్న లక్ష్మీనర్సింహస్వామి సాక్షిగా నిరూపించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సవాల్ చేశారు. మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ ఎమ్మెల్యే రాజయ్య సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జఫర్‌గఢ్ మండలానికి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి కడియం శ్రీహరి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. తెలంగాణలో బీజేపీతో కలిసి టీడీపీ, పవన్ కల్యాణ్ వచ్చినా బీఆర్‌ఎస్ అఖండ మెజారిటీతో తిరిగి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీ మండల ఇన్‌చార్జ్ పసునూరి మహేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు జైపాల్‌రెడ్డి, నాయకులు గబ్బెట బుచ్చయ్య, కడారి శంకర్, కోత్వాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

రఘునాథపల్లి: మండలంలోని గోవర్దనగిరి మాజీ సర్పంచ్ ముప్పిడి యాదగిరి (52) రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం విదితమే. కాగా, సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సోమవారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి గోవర్దనగిరికి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


జనగామ రూరల్: పెంబర్తి జెడ్పీఎస్‌ఎస్ 2004–05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని తమకు విద్య నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. అధ్యాపకులు సురేందర్,రాం చంద్రయ్య, ఖాజా, శ్రీనివాస రెడ్డి, ఆనంద్ కుమార్, శేషు కుమార్, సంధ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

పాలకుర్తి టౌన్: పాలకుర్తి సర్కిల్ పరిధిలో పాలకుర్తి ప్రొబెషనరీ ఎస్సైగా రాజేష్, కొడకండ్ల ప్రొబెషనరీ ఎస్సైగా కళ్యాణ్‌కుమార్, దేవరుప్పుల రాజేందర్‌లు సోమవారం బాధ్యతలు చేపట్టినట్లు పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు ప్రొబెషనరీ ఎస్సైలుగా నెల రోజుల పాటు ఆయా పోలీస్‌స్టేషన్‌లో ట్రైనింగ్‌లో ఉంటారని సీఐ తెలిపారు.

పెద్దదిక్కును కోల్పోయి.. ఒంటరైన కుటుంబం

● దహనసంస్కారాలకు సైతం డబ్బులు లేని వైనం
● ఆదుకున్న దాతలు



రాజు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

తరిగొప్పుల: మండలం శివారు గ్రామం కనీలకుంటలో ఓ విషాదకరమైన సంఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బాషబోయిన రాజు(38)అనే నిరుపేద వ్యక్తి అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబం దిక్కులేనిదైంది. రాజు తల్లి పక్షపాతంలో బాధపడుతుంది. మృతుడు భార్య పల్లవి కూలీ పనులకు వెళ్తూ కుటుంబ పోషణలో భర్తకు చేదోడువాదోడుగా ఉంటుంది .కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించే రాజు మరణించడంతో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయి తీవ్ర దుర్భర పరిస్థితిలోకి నెట్టివేయబడింది. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, కనీ సం ఉండడానికి నిలువనీడ లేని ఈ నిరుపేద కుటుంబా న్ని ఆదుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని, మనసున్న దాతలను వేడుకుంటున్నారు. దిక్కులేని వారైన ఆ చిన్నపిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని, దాతలు ఎవరైనా ముందుకు వచ్చి వారికి తోచిన సహాయం అందించా లని, మానవతా దృక్పథంతో స్పందించి కుటుంబా నికి చేయూతనివ్వాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్థిక సాయం అందజేత

కాగా, విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు ఏదెల్లి శ్రీనివాస్‌రెడ్డి రూ.5వేలు, తరిగొప్పుల ముదిరాజ్ సంఘం రూ.55వేలు దహనసంస్కారాల నిమిత్తం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.

విద్యార్థులకు సన్మానం

జనగామ రూరల్: పట్టణంలోని ధర్మకంచ జెడ్పీ బాలుర హైస్కూల్‌లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సోమవారం ఘనంగా సన్మానించారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మేడ శ్రీనివాస్ టెన్త్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను సన్మానించారు. శ్రీనివాస్, స్టాలిన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మండల టాపర్‌కు నగదు ప్రోత్సాహకం

దేవరుప్పుల: మండలంలోని ప్రభుత్వ హైస్కూళ్ల పరిధిలో పదో తరగతి పరీక్షల్లో టాపర్‌గా నిలిచిన చిన్న మడూర్ హైస్కూల్ విద్యార్థిని గడ్డం కేజియాకు కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు గౌరిగె నర్సింహ రూ.5 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. వంద శాతం ఉత్తీర్ణత కోసం పాటుపడిన ఉపాధ్యాయులు, విద్యార్థులను ఘనంగా సన్మానించారు. మాజీ మార్కెట్ డైరెక్టర్ మైదాన్ జోగేశ్వర్, పాఠశాల మాజీ చైర్మన్ గూడ నరసయ్య , బీఆర్‌ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.